సాక్షి నంద్యాల

మంగళవారం : 10 : జనవరి : 2023



హోరాహోరీగా..

ఎమ్మిగనూరు: జాతర సందర్భంగా సోమవారం పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను తిలకించేందుకు రైతులు తరలివచ్చారు.



ఆకట్టుకున్న లవకుశ

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో సురభి కళాకారులు ప్రదర్శించిన లవకుశ నాటకం ఆకట్టుకుంది. శ్రీరామ పట్టాభిషేకం, లవకుశల ఆశ్రమ విద్యాభ్యాసం ఘట్టాలు అలరించాయి.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,622.70
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:69.231
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,187

న్యూస్‌రీల్

వైభవంగా పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె: యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామికి సోమవారం పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో ఉదయం ఏకశిలా రూపంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వరులకు అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీ సేవా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఉమా మహేశ్వరస్వామి నిత్యాన్నదాన సంస్థ సభ్యులు దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మల్లన్నకు పూజలు



వెండి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించిన తర్వాత మండపంలో వెయ్యి దీపాలను వెలిగించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేపట్టారు.

'గండ్లేరు' బండ్‌కు మరమ్మతులు



రిజర్వాయరు కట్టపై మట్టి తోలుతున్న దృశ్యం

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతంలోని గండ్లేరు రిజర్వాయరు బండ్‌కు మరమ్మతులు చేపట్టారు. హరినగరం సమీపంలోని రిజర్వాయర్ బండ్ పైభాగం గుంతలు మయం కావడంతో అధికారుల పరిశీలన, మత్స్యకారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సమస్యను తెలుగుగంగ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ మేరకు రూ. 10 లక్షలు మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టి కట్టకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించి, గ్రావెల్ వేసి చదును చేయిస్తున్నారు.

రూ.4 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

- జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ మహాలక్ష్మి



క్యాలెండర్లు విడుదల చేస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ మహాలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు టర్నోవర్ రూ.4000 కోట్లకు తీసుకెళ్లాలనేది తమ లక్ష్యమని చైర్‌పర్సన్ ఎస్.మహాలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం బ్యాంకు టర్నోవర్ రూ.3,400 కోట్లు ఉందని పేర్కొన్నారు. సోమవారం డీసీసీబీలోని తన చాంబరులో 2023 క్యాలెండర్లు, డైరీలను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. కర్నూలు డీసీసీబీని రాష్ట్రంలోనే 5వ స్థానానికి తెచ్చామన్నారు. డిపాజిట్ల ద్వారా సొంతంగా నిధులు సమకూర్చుకుని, రైతులకు, ఇతర అన్ని వర్గాల ప్రజలకు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. పీఏసీఎస్‌లను కూడా ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ పి.రామాంజనేయులు, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, ఏజీఎం త్రినాథ్‌రెడ్డి, మేనేజర్లు, అసిస్టెంటు మేనేజర్లు పాల్గొన్నారు.

నూతన ఒరబడి

ప్రస్తుత పోటీ ప్రపంచంలో మెడిసిన్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు మెరుగైన ర్యాంకులు తప్పక సాధించాలి. ఇందుకు జాతీయ స్థాయి విద్యా విధానం (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెంకండరీ ఎడ్యుకేషన్) కీలకంగా మారింది. ఈ తరుణంలో నగరాలు, పట్టణాల్లోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకే పరిమితమైన సీబీఎస్ఈ సిలబస్ ఇక మారుమూల ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసింది. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్ లక్ష్యంగా మరింత నాణ్యమైన, ఖరీదైన విద్య చేరువ చేసేందుకు శ్రీకారం చుట్టింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేందుకు ఇప్పటికే సన్నాహాలు చేపట్టింది.



డిజిటల్ విధానంలో సీబీఎస్ఈ పాఠ్యాంశాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సీబీఎస్ఈకి సై

- ప్రభుత్వ పాఠశాలల్లో సెంట్రల్ సిలబస్ విద్యాబోధన
- వచ్చే విద్యా సంవత్సరం 9వ తరగతి నుంచి అమలుకు చర్యలు
- జిల్లాలో మొదటి విడతగా 69 పాఠశాలలు ఎంపిక
- పుస్తకాల ముద్రణ, ఉపాధ్యాయుల శిక్షణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



సీబీఎస్ఈ బోధనకు ఎంపికైన ఆళ్లగడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం కళాశాల

ఆళ్లగడ్డ: విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం మరో సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం, కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థల్లో మాత్రమే అందుబాటులో ఉన్న సీబీఎస్ఈ సిలబస్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టనున్నారు. ఈ మేరకు 2023 – 24 విద్యా సంవత్సరం నుంచి ఈ ప్రక్రియను నిర్వహించేందుకు నంద్యాల జిల్లాలో తొలివిడతగా 69 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ మేరకు ఆయా బడుల్లో ప్రధానోపాధ్యాయులు, సహాయ ప్రధానోపాధ్యాయులు ఇప్పటికే శిక్షణ కూడా పూర్తి చేసుకుని సిద్ధమయ్యారు. ప్రస్తుత ం జాతీయ స్థాయి పోటీ పరీక్షలు, ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు సీబీఎస్ఈ సిలబస్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. పదో తరగతి, ఇంటర్మీడియట్ ను సీబీఎస్ఈ సిలబస్‌లో పూర్తి చేసిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో సత్తా చాటేందుకు అవకాశాలు ఉన్నాయి. ఆరో తరగతిలో చేరితే +2 (ఇంటర్) విద్య వరకు ఇక్కడే ఉచితంగా పూర్తి చేయవచ్చు. విద్యాలయాల పర్యవేక్షణ సీబీఎస్ఈ బోర్డ్ పరిధిలో ఉంటుంది.

పది అంశాలపై నివేదిక

సీబీఎస్ఈను అమలు చేయనున్న పాఠశాలలకు సంబంధించి ప్రభుత్వం ముందుగా పది అంశాలపై కేంద్ర విద్యామండలికి నివేదిక అందజేసింది. పాఠశాలల గుర్తింపు, విశాలమైన స్థలం, భవన సముదాయం, ఫైర్ సేఫ్టీ, ధ్రువపత్రం, పాఠశాల యాజమాన్య కమిటీ, ఈపీఎఫ్ గుర్తింపు సంఖ్య, ఎకో ఫ్రెండ్లీ వాతావరణం, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల విద్యార్హతలు, వెబ్‌సైట్ తదితర వివరాలను ఆ నివేదికలో పొందుపరిచారు. ఈ మేరకు జిల్లాలోని 28 మండలాల పరిధిలో 285 పాఠశాలలు సీబీఎస్ఈ బోధనకు సిద్ధంగా ఉన్నాయని ప్రతిపాదించగా తొలి విడతగా 69 పాఠశాలలు ఎంపికయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన అమలు కానుంది. అనంతరం సాధ్యాసాధ్యాలను పరిశీలించి మిగిలిన పాఠశాలల్లో కూడా అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

ప్రతి మండలంలో..

సీబీఎస్ఈ విధానం ఇప్పటి వరకు జిల్లాలో ఒక్క ప్రభుత్వ పాఠశాలలో కూడా లేదు. ఒకటి, రెండు కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాత్రమే అందుబాటులో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసేందుకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించింది. 2023 – 24 విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో 69 ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి నుంచి సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయనుంది. నియోజకవర్గానికి 10 నుంచి 11కి పైగా సీబీఎస్ఈ సిలబస్ ప్రభుత్వ పాఠశాలలు రానున్నాయి. కాగా 2024 – 25 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఈ విధానంలోనే పరీక్షలు రాయనున్నారు.

సీబీఎస్ఈకి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల వివరాలు

నియోజకవర్గం	ఎంపికైన పాఠశాలల సంఖ్య
పాణ్యం	5
ఆళ్లగడ్డ	14
నంద్యాల	5
డోన్	9
బనగానపల్లె	11
నందికొట్కూరు	13
శ్రీశైలం	12

పేద విద్యార్థులకు వరం



సీబీఎస్ఈ విధానం విద్యార్థులకు వరం. ఇప్పటి వరకు కార్పొరేట్, కేంద్ర ప్రభుత్వ విద్యాలయాల్లో మాత్రమే ఉన్న ఈ విధానం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమల్లోకి తీసుకురావడం శుభపరిణామం. కేంద్ర విద్యామండలి నిబంధనల మేరకు అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్న పాఠశాలల ఎంపిక వెబ్‌సైట్ ద్వారా జరిగింది. వచ్చే విద్యా సంవత్సరం 9వ తరగతి నుంచి ఈ విధానం అములు చేసేందుకు ఇప్పటి నుంచే 8వ తరగతి విద్యార్థులరె సన్నద్ధం చేస్తున్నాం.

– అనురాధ, జిల్లా విద్యాశాఖాధికారిణి

ఆశలు నెరవేరనున్నాయి



ఇంతకాలం ఉన్నత వర్గాలకు చెందిన పిల్లలకు మాత్రమే పరిమితమైన సీబీఎస్ఈ సిలబస్ ఇక నుంచి మాలాంటి బడుగు, బలహీన వర్గాల పిల్లలకు కూడా అందుబాటులోకి వస్తుండటం ఆనందంగా ఉంది. మా పిల్లల భవిష్యత్‌కు జగనన్న బంగారు బాటలు వేస్తున్నారు. పేద పిల్లలు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంది.

– విజయరాణి, క్రిష్టిపాడు

సీఎం ఆశయం నెరవేర్చుతాం



పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ తప్పనిసరి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు సైతం ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం మెండుగా ఉంటుంది. మా పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ అమలు కాబోతుండటం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి జగనన్న ఆశయం నెరవేరేలా విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.

– సీహెచ్‌కే సంధ్యారాణి, ప్రిన్సిపాల్, బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకులం కాలేజ్

ఆస్తి లాగేసుకుని గెంటేశారు

- కుమారులపై ఎస్పీకి ఫిర్యాదు చేసిన వృద్ధుడు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ఆస్తి మొత్తం కుమారులు తీసుకుని తిండి పెట్టకుండా తనను ఇంటి నుంచి గెంటేశారని పొన్నాపురం కాలనీకి చెందిన ఓ వృద్ధుడు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డికి స్పందనలో ఫిర్యాదు చేశాడు. బొమ్మలసత్రం సమీపంలోని ఎస్పీ కార్యాలయ ఆవరణలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 110 వినతులు అందాయన్నారు. స్పందనలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చేస్తామన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. వినతుల్లో ఎక్కువగా సివిల్ తగాదాలు, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు తదితర సమస్యలు అధికంగా వస్తున్నాయని వివరించారు.

స్పందనలో ఫిర్యాదులు కొన్ని...

- ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన లక్ష్మీరెడ్డి అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ. 1.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని రైతునగరం గ్రామానికి చెందిన సరోజ, మహేశ్వరమ్మ, వీరాంజనేయుడు ఫిర్యాదు చేశారు.
- తన బ్యాంక్ అకౌంట్‌లో రూ. 10 వేలు తనకు తెలియకుండానే మాయమయ్యాయని, బ్యాంక్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని పలుకూరు గ్రామానికి చెందిన నాగపుల్లమ్మ ఎస్పీకి ఫిర్యాదు చేసింది.
- పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని కర్నూలుకు చెందిన నరహరి రూ. 10 లక్షలు తీసుకుని మోసం చేశాడని బనగానపల్లెకు చెందిన సుదర్శన్, సురేష్ ఫిర్యాదు చేశారు.
- కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ రామాంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'సంకల్పయాత్ర' సంబరాలు

- జిల్లా వ్యాప్తంగా నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బొల్లవరం నుంచి నందికొట్కూరుకు పాదయాత్రగా వస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, పీపీ నాగిరెడ్డి తదితరులు

బొమ్మలసత్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర పూర్తయి సోమవారానికి నాలుగేళ్లు అయిన సందర్భంగా జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. మహానేత వైఎస్‌ఆర్‌కు నివాళులర్పించారు. నంద్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి స్వగృహంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. స్థానిక చామకాల్వ సర్కిల్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, డైరెక్టర్లు చంద్రశేఖర్, సునిత అమృతరాజ్, శశికళారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- నందికొట్కూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే బొల్లవరం నుంచి నందికొట్కూరుకు 6 కి.మీ పాదయాత్ర చేశారు. వృద్ధులకు అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అబ్దుల్‌సుకూర్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.
- డోన్‌లో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్వగృహంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. బేతంచెర్లలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి ఆధ్వర్యంలో 100 మంది ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ చేశారు.
- ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు అంజాద్‌అలీ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఆళ్లగడ్డ పట్టణంలో నాయకులు చెన్నయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- అవుకులో దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి సతీమణి చల్లా శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేశారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఈనెల 2 నుంచి 31వ తేదీ వరకు జరుగుతుందన్నారు. విద్యార్థులు ఎన్‌వీఎస్ వెబ్‌సైట్ http:CBSEITMS.RCIL.GOV.IN/NVS ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 29వ తేదీన పరీక్ష ఉంటుందన్నారు.

స్పందన వినతులపై దృష్టి సారించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



అర్జీ దారులను నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల(అర్బన్): స్పందన వినతుల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఇతర అధికారులు ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 268 మంది అర్జీదారులు వినతులు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన ద్వారా స్వీకరించిన ప్రజా వినతులను నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కరించాలన్నారు. పాములపాడు, బేతంచెర్ల, దొర్నిపాడు, ఆత్మకూరు మండలాల్లోని సచివాలయ సిబ్బంది మధ్యాహ్నం హాజరు 50 శాతం కన్నా తక్కువగా ఉందన్నారు. ఇకపై అన్ని మండలాల సచివాలయాల సిబ్బంది హాజరుపై రోజు వారీ నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆత్మకూరు, బండిఆత్మకూరు, జూపాడుబంగ్లా, కొవెలకుంట్ల, కొలిమిగుండ్ల, రుద్రవరం మండలాల్లోని సచివాలయాల సిబ్బంది ఫేక్ ఫింగర్ ప్రింట్ వేసినట్లు రిపోర్టులు వచ్చాయని వీటిపై క్షుణ్ణంగా విచారణ జరిపి నివేదిక అందజేయాలన్నారు. 216 డేటా పాయింట్లకు సంబంధించిన మిషన్ అంత్యోదయ సర్వేను పకడ్బందీగా ప్రారంభించాలన్నారు. అన్ని శాఖల్లో కోర్టు కేసులకు సంబంధించి కౌంటర్ ఫైల్ చేయడంతో పాటు మధ్యంతర, తుది ఉత్తర్వులను అమలు పరచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పని తీరు మార్చుకోండి

- డీఈఓ ఆఫీస్ సిబ్బందిపై ఏడీ ఆగ్రహం

కర్నూలు సిటీ: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగుల పనితీరుపై అసిస్టెంట్ డైరెక్టర్ శ్యాముల్ పాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల పని తీరుపై వస్తున్న ఫిర్యాదులపై ఏడీ సోమవారం తన కార్యాలయంలో సమీక్షించారు. నిత్యం ఎంతో మంది వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తుంటారని, అయితే, చాలా మంది ఉద్యోగులు అందుబాటులో ఉండడం లేదన్నారు. ప్రతి ఉద్యోగి ఏ రోజు ఎన్ని ఫైల్స్ క్లియర్ చేశారో కూడా తెలియడం లేదన్నారు. ఇక నుంచి టీ తాగేందుకని బయటకు వెళ్లకూడదని, ఆఫీస్‌కే తెప్పిస్తామని చెప్పారు.

గజగజ

వణికిస్తున్న చలి

- అత్యల్ప స్థాయికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- మంత్రాలయం, కర్నూలు రూరల్, ఆదోనిల్లో 6 డిగ్రీలే
- కోల్డ్‌వేవ్ ప్రభావంతో పెరిగిన ఈదురుగాలులు
- సంక్రాంతి ముగిసే వరకు ఇదే పరిస్థితి



మహానంది మండలం బుక్కాపురంలో తెల్లవారుజామున చలిమంట వేసుకున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ప్రజలను చలి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వృద్ధులు, చిన్నారులు, వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు, నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉదయం 8 గంటలు దాటినప్పటికీ బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది. చలి ప్రభావంతో గృహ విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గింది. సంక్రాంతి ముగిసే వరకు వాతావరణం ఇదేవిధంగా ఉంటుందని తెలుస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతండటం ఆందోళన కలిగిస్తోంది. మామూలుగా అయితే పగటి ఉష్ణోగ్రతలు 33–34 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 18–20 డిగ్రీల మధ్య నమోదవుతుంది. అయితే కోల్డ్‌వేవ్ ప్రభావంతో ఈదురు గాలులు వీస్తుండటంతో చలి రోజురోజుకు పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు అత్యల్పస్థాయికి చేరడంతో చలి జిల్లాను గజగజలాడిస్తోంది. రాష్ట్రంలోని దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య గాలులు(చల్లని శీతాకాలపు గాలులు–కోల్డ్ వేవ్) వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5–6 డిగ్రీలు పడిపోతున్నాయి. ఇందువల్ల చలి వణికిస్తోంది. మూడేళ్లుగా జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈ కారణంగా చెరువులు, ప్రాజెక్టులు, కాల్వల్లో నీరు పుష్కలంగా ఉంటోంది. కోల్డ్‌వేవ్ చెరువుల మీదుగా వెళ్తున్న ప్రాంతాల్లో చలి మరీ ఎక్కువగా ఉంటోంది. ఈదురు గాలుల ప్రభావం వల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధుల తీవ్రత పెరుగుతోంది.

7వ తేదీ..
ఆదోని మండలం సంతకడలూరులో 14 డిగ్రీలు, బనవాసిలో 15.5, కోసిగిలో 16.1 డిగ్రీల ప్రకారం రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది.

8వ తేదీ..
అలూరు మండలం కమ్మరచేడులో 12.1 డిగ్రీలు, మంత్రాలయంలో 12.4, కర్నూలు రూరల్ మండలం జి.సింగవరంలో 12.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

9వ తేదీ..
మంత్రాలయంలో 6.2 డిగ్రీలు, కర్నూలు రూరల్‌లో 6.6, ఆదోనిలో 6.9, ఎమ్మిగనూరు మండలం బనవాసిలో 7.8, ఎమ్మిగనూరు మండలం సంతకుడ్లూరులో 10 డిగ్రీలు, ఎమ్మిగనూరు మండలం కందనాతిలో 12 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన వినియోగదారులు ఉదయం 10 నుంచి 11గంటల మధ్య 7382614308 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం



మాట్లాడుతున్న కర్నూలు మేయర్ బీవై రామయ్య



బరువు ఎత్తుతున్న బాలిక

- రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ప్రారంభించిన మేయర్ రామయ్య

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి శాప్ లీగ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను ఉద్యోగాలు ఇచ్చి గౌరవిస్తోందన్నారు. గ్రామీణ, మండల, నియోజకవర్గ, జోనల్, రాష్ట్ర స్థాయిలో క్రీడలను నిర్వహిస్తూ శాప్ కొత్త ఒరవడి సృష్టించిందన్నారు. క్రీడాకారులు నిత్యం పోటీల్లో పాల్గొనడంతో వారిలో నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. కర్నూలు నగర పాలక పరిధిలో ఇప్పటికే ఇండోర్ స్టేడియం నిర్మించామని, త్వరలో క్రికెట్ స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. స్కేటింగ్ రింక్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ మాట్లాడుతూ.. అండర్-17 బాలబాలికలకు రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 73 మంది బాలురు, 61 మంది బాలికలు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం చీఫ్ కోచ్ నటరాజరావు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్షావలీ పాల్గొన్నారు.

విజేతల వివరాలు: 40 కిలోల విభాగంలో బి. గీతారాణి (కడప), 45 కిలోల విభాగంలో కె. హిమశ్రీ (పశ్చిమగోదావరి), 49 కిలోల విభాగంలో కె. తరంగిణి (పశ్చిమగోదావరి), 55 కిలోల విభాగంలో హిమశ్రీ (కడప), 59 కిలోల విభాగంలో జి. వర్షిత (శ్రీకాకుళం), 64 కిలోల విభాగంలో సి.హెచ్. హారికా రెడ్డి (కాకినాడ), 71 కిలోల విభాగంలో ఎం. పుష్పాంజలి (కర్నూలు), 76 కిలోల విభాగంలో శ్రీ సాత్విక (కాకినాడ), 81 కిలోల విభాగంలో భవానీ (ఏలూరు) విజేతలుగా నిలిచారు.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్ఠం	గరిష్ఠం
వేరుశనగ	4459	7909
పొద్దుతిరుగుడు	3669	5629
ఆముదం	4889	6450
ఉల్లి	1059	1059
ఎండు మిర్చి	3999	26786
శనగలు	4379	4709
కందులు	2700	7089
మొక్కజొన్న	2143	2147
మినుములు	6901	7091

ఆదోని మార్కెట్ యార్డు ధరలు

పంట	కనిష్ఠం	గరిష్ఠం
పత్తి	5970	8860
వేరుశనగ	4886	7159
ఆముదం	6200	6433
పూలవిత్తనాలు	5456	5736
కందులు	6519	6949

కొలనుభారతి క్షేత్రం ప్రధాన అర్చకుడు మృతి



చంద్రశేఖర శర్మ (ఫైల్)

కొత్తపల్లి: కొలను భారతి దేవి ఆలయ ప్రధాన అర్చకుడు గెంట్యాల చంద్రశేఖర శర్మ (39) సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. శివపురం గ్రామానికి చెందిన ఈయన కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు కర్నూలు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. కాకనూరు శారదా జ్ఞానపీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు శివన్న తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

ఎమ్మిగనూరురూరల్: మాధవరం చెక్ పోస్ట్ దగ్గర భారీగా కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు తెలిపారు. సోమవారం స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణలో నిందితుడి అరెస్ట్ చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్ట్ దగ్గర ఆదివారం రాత్రి తనిఖీ చేస్తుండగా బొలేరో వాహనంలో 31 బాక్సుల కర్ణాటక మద్యం కనిపించిందన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని, రాయచూర్‌కు చెందిన డ్రైవర్ బాలరాజును అరెస్ట్ చేసినట్లు చెప్పారు. మద్యం సరఫరా చేసే వ్యక్తి రాయచూర్ పట్టణానికి చెందిన రామాంజనేయులపై కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 1.55 లక్షలు ఉంటుందన్నారు.

అరుణాచలప్రదేశ్ మద్యం..

ఎమ్మిగనూరు పట్టణం అన్నమయ్య సర్కిల్ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా వెంకటాపురం కాలనీకి చెందిన పి. అంజనేయులు నుంచి 9 అరుణాచల్‌ప్రదేశ్ చెందిన మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించారన్నారు. మాధవరం చెక్‌పోస్ట్ సెబ్ సీఐ దశరథరామిరెడ్డి, ఎస్ఐలు సోమశేఖర్‌రావు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

భాషా పరిరక్షణ అందరి బాధ్యత

- నరసం రాష్ట్ర సదస్సులో శాసన మండలి మాజీ ఉప సభాపతి డాక్టర్ మండలి బుద్ధప్రసాద్



నేను సైతం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాసన మండలి పూర్వ ఉప సభాపతి డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక తదితరులు

కర్నూలు కల్చరల్: తెలుగు భాష పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని శాసన మండలి మాజీ ఉప సభాపతి, పూర్వ అధికార భాషా సంఘం అధ్యక్షుడు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర సదస్సు, నాలుగో వార్షికోత్సవం సోమవారం కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భాష లేకపోతే జాతి నశించి పోతుందన్నారు. తల్లి ఒడి నుంచే మాతృభాష మొదలవుతుందన్నారు. భాషలో సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర దాగి ఉన్నాయన్నారు. మహిళలు సామాజిక సమస్యలపై స్పందిస్తూ రచనలు చేయాలన్నారు. దేవదాయ శాఖ పూర్వ కమిషనర్, విశ్రాంత కలెక్టర్ నందివెలుగు ముక్తేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు అర్థమయ్యే భాషలో పాలన సాగాలన్నారు. సాహిత్యం వల్ల ప్రేమాభిమానాలు, ఆప్యాయతలు పొందవచ్చని చెప్పారు. కళాకారులు, సాహితీవేత్తలు ఇతర రంగాల వారికంటే గొప్పవారన్నారు. సాహిత్య రచనలపై వర్క్ షాప్‌లు నిర్వహించాలన్నారు. నరసం గౌరవాధ్యక్షులు తేళ్ల అరుణ మాట్లాడుతూ మంచి సాహిత్యాన్ని సమాజానికి అందించాలనే లక్ష్యంతో నరసం పని చేస్తోందన్నారు. మానవ జీవన వికాసంలో భాషకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక, గుంటూరుకు చెందిన ప్రసిద్ధ పండితులు కళారత్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, నరసం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కళావతి చినలక్ష్మి, కళామిత్ర మండలి అధ్యక్షులు నూనె అంకమ్మరావు, కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి, నరసం జిల్లా అధ్యక్షురాలు కా.వెం. సుబ్బలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దండబోయిన పార్వతీ దేవి, ఎస్‌వీ ఫౌండేషన్ వైస్ చైర్మన్ విజయ మనోహరి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి మాట్లాడారు. అనంతరం నరసం రచయిత్రుల కవితా సంపుటి 'నేను సైతం' ఆవిష్కరణ, 'మహిళలు - సమాజ ప్రగతి దీపికలు' అనే అంశంపై సదస్సు, కవి సమ్మేళనం, సాహితీ వేత్తలకు సన్మానం కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో రచయిత్రులు ఆరేపల్లి వరలక్ష్మమ్మ, సింహాద్రి జ్యోతిర్మయి, కె.స్వర్ణలత, హైమావతి, పసుపులేటి నీలిమ, జయసుశీల, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, శతావధాని మద్దూరు రామ్మూర్తి, మధుర కవి ఎలమర్తి రమణయ్య, పత్తి ఓబులయ్య పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన రమాదేవి

బనగానపల్లెరూరల్: బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేట కాలనీకి చెందిన జక్కు రమాదేవి(32) ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రమాదేవి భర్త సురేష్ టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తూ ఇంటిని పట్టించుకోక పోవడంతో పలుమార్లు మందలించింది. సంపాదన అంతా మద్యానికి వెచ్చిస్తుండంతో మానుకోవాలని కోరినా వినలేదు. దీంతో మనస్తాపం చెందిన రమాదేవి ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని మృతి చెందింది. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతురాలి తండ్రి రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతూ..

అవుకు: శింగనపల్లె గ్రామానికి చెందిన కొంచె శంకరమ్మ (58) ఆత్మహత్యకు పాల్పడింది. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం గ్రామ సమీపంలో ఆకుమళ్ల రహదారిలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భర్త దాడిలో భార్య మృతి

బనగానపల్లెరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త దాడిలో గాయపడిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. నందవరం గ్రామానికి చెందిన శివలక్ష్మి (32)ని గత నెల 24వ తేదీన ఆమె భర్త సుబ్రమణ్యం తీవ్రంగా కొట్టడంతో గాయపడింది. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయ రెడ్డి తెలిపారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పొదుపు మహిళలకు నాటు కోళ్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): రక్తహీనత సమస్యను అధిగమించాలనే లక్ష్యంతో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు నాటు కోళ్ల పంపిణీ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ- వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతి మండలంలో 200 నాటు కోళ్ల యూనిట్లు పంపిణీ చేయాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు 1,350 యూనిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఒక యూనిట్‌లో 8 నాటు కోడి పెట్టలు, 3 పుంజులు ఉంటాయని, యూనిట్ కాస్ట్ రూ.3150 ఉండగా, సబ్సిడీ లేకుండా మహిళలు మొత్తం ధర చెల్లించాల్సి ఉంటుందన్నారు. కోళ్లతో పాటు మూడు రకాల మందులు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నాటు కోళ్ల పంపిణీ కార్యక్రమం చురుగ్గా జరుగుతోందన్నారు.

డీసీసీబీ పరీక్షకు76 శాతం హాజరు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంటు పోస్టుల భర్తీకి నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షకు 76 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. సోమవారం ఉదయం 8 నుంచి 10.30 వరకు, 11.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ పరీక్షను కర్నూలు, వైఎస్‌ఆర్ జిల్లాలో నిర్వహించారు. 18 పోస్టులకు 1,586 మంది దరఖాస్తు చేసుకోగా 1,196 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. కర్నూలులో జరిగిన పరీక్షను జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈఓ రామాంజనేయులు, ఆప్కాబ్ ఏజీఎం భరద్వాజ శర్మ పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

హాలహర్వి (ఆలూరు రూరల్): మిరప పంట విక్రయించేందుకు వెళ్తుండగా టిప్పర్‌ను వెనుక నుంచి బస్సు ఢీకొట్టడంతో నలుగురు రైతులు గాయపడ్డారు. హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామానికి చెందిన హనుమప్ప, యువరాజ్, రవి, లక్ష్మీకాంత్ కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడిగి మార్కెట్‌లో మిరప పంట విక్రయించేందుకు మినీ టిప్పర్‌లో బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో దావణగేరి పట్టణం సమీపంలోని హైవేలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో వీరు గాయపడ్డారు.

యువకుడి బలవన్మరణం

శిరివెళ్ల: మహదేవపురానికి చెందిన జాకీర్‌హుస్సేన్ (26) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ యువకుడు గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. ఏడాది నుంచి కడుపు, నడుమునొప్పితో బాధపడుతున్నాడు. తీవ్ర మనస్తాపానికి ఆదివారం పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం జెడ్పీలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో ఢిల్లీలో బ్లాక్ పంచాయత్ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ), డిస్ట్రిక్ట్ పంచాయత్ డెవలప్‌మెంట్ ప్లాన్ (డీపీడీపీ)పై రెండు రోజుల పాటు వర్క్‌షాప్ జరిగిందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఆరు అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయని చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవడం, గ్రామాల పరిశుభ్రత, పల్లెల్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడం, పేదరిక నిర్మూలన తదితర అంశాలపై సుదీర్ఘమైన చర్చ జరిగిందన్నారు. ఈ చర్చలో వాటర్ సఫిషియంట్ విలేజ్ అంశంపై తన అభిప్రాయాలను తెలియజేశానన్నారు. గ్రామంలోని ప్రతి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల రక్షిత మంచినీటిని అందిస్తూనే, పరిశ్రమలు, వ్యవసాయానికి కూడా నీటిని కేటాయించే అంశంపై చర్చించామన్నారు. నీటి వినియోగంపై ఆడిట్ జరగాల్సిన అంశం కూడా ప్రస్తావనకు వచ్చిందన్నారు. ప్రస్తుతం జలజీవన్ మిషన్ కార్యక్రమంలో ఇంటింటికీ కుళాయిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే అన్ని మండలాల్లో బ్లాక్ పంచాయత్ డెవలప్‌మెంట్ ప్లాన్ అమలు చేసేందుకు క్షేత్ర స్థాయి అధికారులు చర్యలు చేపట్టారన్నారు.

రూ.2.90 కోట్లతో జగనన్న కాలనీలకు ముఖ ద్వారాలు



జగనన్న కాలనీ ముఖ ద్వారం మోడల్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 70 వైఎస్సార్ జగనన్న కాలనీలకు రూ.2.90 కోట్ల వ్యయంతో ముఖ ద్వారాలను నిర్మించనున్నట్లు పీఆర్ పర్యవేక్షక ఇంజినీరు కే సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం పాలనా అనుమతులను కూడా మంజూరు చేసిందన్నారు. కర్నూలు జిల్లాలో 40, నంద్యాల జిల్లాలో 30 కాలనీలకు ముఖ ద్వారాలను నిర్మించనున్నట్లు చెప్పారు. ఒక్కో ముఖ ద్వారానికి రూ.4.15 లక్షల ప్రకారం నిధులను వెచ్చించునున్నట్లు తెలిపారు. ఈ ముఖ ద్వారాల నిర్మాణానికి సంబంధించిన మోడల్, కొలతలు, ప్లాన్ కూడా ప్రభుత్వం పంపించిందన్నారు. ఒక్కో ముఖ ద్వారం 16 అడుగుల ఎత్తు, 20 అడుగుల వెడల్పు ఉండేలా ప్లాన్ పంపారన్నారు. ఈ నిర్మాణాలకు ఎలాంటి నిధుల కొరత లేదని, ప్రభుత్వం అనుమతించిన కాలనీల ముఖ ద్వారాల పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ముఖ ద్వారాలను నిర్మిస్తే కాలనీకే కొత్త అందం వస్తుందనే అభిప్రాయాన్ని ఎస్ఈ వ్యక్తం చేశారు.

అర్హులైన రైతులకు డ్రిప్ సౌకర్యం

- ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి హరినాథరెడ్డి



ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామంలో డ్రిప్ సదుపాయాన్ని పరిశీలిస్తున్న హరినాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): అర్హులైన రైతులకు డ్రిప్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ సీబీ హరినాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కర్నూలు, నంద్యాల జిల్లాల్లో డ్రిప్, తుంపర్ల సేద్యాన్ని తనిఖీ చేశారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పరికరాల నాణ్యతపై ఆరా తీశారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో ఈ ఏడాది బిందు, తుంపర్ల సేద్యాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లా డ్రిప్ లక్ష్యం 6,500 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 2,761 హెక్టార్లకు పరికరాల సరఫరా, అమర్చడం పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఈయన వెంట ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, ఏపీడీ రాజకృష్ణారెడ్డి, కర్నూలు జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు, ఉద్యాన అధికారి మహబూబ్‌బాషా ఉన్నారు.

దుకాణాలకు వేలం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలోని సిద్ధిరామప్ప కాంప్లెక్స్‌లోని ఐదు దుకాణాలకు, మల్లికార్జున సదన్‌లోని మరో దుకాణానికి సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. దేవస్థానం సహాయ కమిషనర్ వెంకటేష్, రెవెన్యూ విభాగ ఏఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం ఆరు దుకాణాలకు నిర్వహించిన బహిరంగ వేలంలో పాటదారులు రెండు దుకాణాలను దక్కించుకున్నారు. మిగిలిన 4 దుకాణాలకు వేలం పాడేందుకు ఔత్సాహికులు ఆసక్తి చూపక పోవడంతో వేలం వాయిదా వేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సూపరింటెండెంట్ అయ్యన్న, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న ఆటో.. ఒకరు మృతి



ఆటోలోనే మృతి చెందిన హనుమంతు

ఆదోని రూరల్: పట్టణ శివారులోని సిరుగుప్ప రోడ్డులో లక్ష్మమ్మ వేర్‌హౌస్ వద్ద సోమవారం తెల్లవారుజామున ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దహరివాణానికి చెందిన హనుమంతు(33) ఆదివారం ఎమ్మిగనూరులో నీలకంఠేశ్వరస్వామి జాతర చూసుకుని ఆదోనికి అర్ధరాత్రి చేరుకున్నాడు. స్వగ్రామమైన పెద్దహరివాణానికి వెళ్లేందుకు ఆటో మాట్లాడుకున్నారు. క్రాంతినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ లక్ష్మీనారాయణతో కలిసి పెద్దహరివాణానికి బయలుదేరాడు. సిరుగుప్ప రోడ్డులో ఆటో అదుపుతప్పి ఓ చెట్టుకు ఢీకొనింది. ఈ ప్రమాదంలో హనుమంతు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్ లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి.